క్లుప్తంగా

పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి దామోదర



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి దామోదర

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లి భద్రకాళీ సమేత వీరభద్ర దేవాలయ మహోత్సవ పోస్టర్‌ను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆవిష్కరించారు. 24 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ మహోత్సవాలకు మంత్రిని ఆహ్వానించినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ గ్రామ నాయకులు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

మందులు పట్టివేత



ఆసుపత్రిలో తనిఖీ చేస్తున్న అధికారి రాజిరెడ్డి

నిజాంపేట(మెదక్): ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో అక్రమంగా నిల్వ ఉంచిన మందులను డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి సీజ్ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ నిజాంపేటలోని ఆర్ఎంపీ పద్మావతి పోస్టెడ్ క్లినిక్‌లో గురువారం తనిఖీ నిర్వహించామన్నారు. అక్రమంగా నిల్వ ఉంచిన రూ.74వేల విలువైన 45రకాల మందులను గుర్తించామని, ప్రభుత్వ నిబంధనలకు అతిక్రమిస్తే చర్యలు తప్పవని రాజిరెడ్డి హెచ్చరించారు.

ఉన్నత శిఖరాలకు ఎదగాలి



సర్టిఫికెట్ అందజేస్తున్న కాలేజీ, సొసైటీ ప్రతినిధులు

నర్సాపూర్: శిక్షణ పొంది ఉన్నత శిఖరాలకు ఎదగాలని శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ రవీంద్రబాబు, బీవీఆర్ఐటీ కాలేజీ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్ పిలుపునిచ్చారు. బీవీఆర్ఐటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల ఉచిత కంప్యూటర్ శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో శనివారం వారు పాల్గొన్నారు. కాలేజీకి ఐటీ విభాగం ఆధ్వర్యంలో ఈ శిక్షణ శిబిరం నిర్వహించామని ఐటీ హెచ్ఓడీ దశరథరామయ్య చెప్పారు. ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ అమరేందర్‌రెడ్డి, మేనేజర్ బాపిరాజు, ఏఓ అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

125 మందికి వైద్య పరీక్షలు



మందులు అందజేస్తున్న వైద్యులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి రత్నపూర్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మేడ్చల్ మెడిసిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో 125 మందికి రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. అవసరమైన 30మందికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని ఆసుపత్రి మార్కెటింగ్ ఇన్‌చార్జి కుమారస్వామి తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు రాజేశ్, రుచిత, కల్పన, అనూష తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలు

మెదక్ కలెక్టరేట్: మెదక్‌లోని ప్రభుత్వ ఐటీఐలో పలు ట్రేడ్‌లలో సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తిగల అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికిగాను కోపా (కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్) ట్రేడ్, డీజిల్ మెకానిక్ ట్రేడ్‌తో పాటు 2024–26 రెండు సంవత్సరాల వ్యవధిగల ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ ట్రేడ్‌లో సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. సీట్ల ఎంపికలో పదో తరగతి మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్, మహిళా అభ్యర్థులకు 33శాతం అమలులో ఉంటుందని, పూర్తి సమాచారం కోసం మెదక్‌లోని వెల్‌కంబోర్డు వద్దగల ప్రభుత్వ ఐటీఐలో సంప్రదించవచ్చని సూచించారు.

అకాల వర్షం తడిసిన ధాన్యం



వెల్దుర్తి(తూప్రాన్): వర్షం నీటిలో ధాన్యం రాశులు



శివ్వంపేట(నర్సాపూర్): తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఏఓ

వెల్దుర్తి(తూప్రాన్)/శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిముద్దయింది. ఆరుగాలం కష్టించి పండించిన పంట నీటమునగడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా శివ్వంపేట మండలంలోని ఎదుల్లాపూర్, ఉసిరికపల్లి గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో కళ్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం కేంద్రాలకు తరలించే తరుణంలో వర్షం వల్ల నష్టపోవాల్సి వచ్చిందని రైతులు వాపోయారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని తహసీల్దార్ శ్రీనివాస్‌చారి, ఏఈఓ లావణ్య పరిశీలించారు.

మిల్లర్ల సహకారం అవసరం

- లారీలు వెంటనే ఖాళీచేసి పంపాలి
- మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రావు

సాక్షి ఎఫెక్ట్



మిల్లు యజమానితో మాట్లాడుతున్న అధికారులు

నర్సాపూర్: రైసుమిల్లుల్లో గోదాం ఖాళీని అనుసరించి లారీలను వెంటనే అన్‌లోడ్ చేసి పంపాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు మిల్లర్లకు సూచించారు. శనివారం సాక్షిలో వచ్చిన 'తడుస్తూ.. ఎండుతూ' కథనానికి ఆయన స్పందించారు. మండలంలోని శివసాయి, వెంకటేశ్వర, సాయి కృష్ణ, తిరుమల, సాయి వెంకటేశ్వర రైసుమిల్లులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మిల్లర్లతో మాట్లాడుతూ ఆయా మిల్లులకు సంబధించిన గోదాంలో ఎంత ఖాళీ ఉందని ఆరా తీశారు. ఖాళీ స్థలం మేరకు కొనుగోలు కేంద్రాల నుంచి వడ్లు తీసుకోవాలని, లారీలను వెంట వెంటనే ఖాళీ చేయించి కేంద్రాలకు పంపాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలు సజావుగా కొనసాగడానికి మిల్లర్లు సహకరించాలని శ్రీనివాస్‌రావు సూచించారు. లారీలు ఖాళీ చేసేందుకు అవసరమైన హమాలీలను పెట్టుకోవాలని, ఇతర ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. మండలంలోని బ్రాహ్మణపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీచేసి అక్కడ ధాన్యం నిలువ, కొనుగోలు ప్రక్రియను, ట్యాబ్ ఎంట్రీ పనులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆయన వెంట జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మోహన్, ఏపీఎం గౌరీశంకర్ ఉన్నారు.

లారీకి ఎనిమిది బస్తాల ధాన్యం కట్

- రైస్‌మిల్ యాజమాన్యంపై ఫిర్యాదు
- నష్ట పోతున్నామని రైతుల ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులు

కౌడిపల్లి(నర్సాపూర్): రైస్‌మిల్‌కు లారీ ధాన్యం తరలిస్తే అందులో ఎనిమిది బస్తాల ధాన్యం కట్ చేస్తున్నారని దీంతో తాము నష్టపోతామని భుజిరంపేట రైతులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. శనివారం గ్రామానికి చెందిన పలువురు రైతులు నాయికోటి నాగభూషణం, ఆకుల లక్ష్మయ్య, బొగ్గుల కిష్టయ్య, సంది కిష్టయ్య, చింతల ఏసు, అర్జున్, శ్రీను, గాజుల సురేశ్ తదితరులు మాట్లాడుతూ ఈనెల 4వ తేదీన చిలప్‌చెడ్ మండలం సోమక్కపేట సొసైటీకి రెండు లారీల ధాన్యం విక్రయించగా నర్సాపూర్ మండలం లింగాపూర్‌వద్దగల తిరుమల అగ్రోస్ ఇండస్ట్రీకి రైస్‌మిల్‌కు తరలించినట్లు చెప్పారు. లారీకి ఎనిమిది నుంచి పది బస్తాల ధాన్యం తక్కువ వస్తున్నట్టు రైస్‌మిల్ నిర్వాహకులు తమకు చెప్పారన్నారు. కొనుగోలు కేంద్రంవద్ద తూకం వేసినప్పుడు ఒక్కో బస్తా 42.50కిలోలు తూకం వేశారని, అయినప్పటికీ తరుగు పేరుతో రైస్‌మిల్ నిర్వాహకులు ఒక్కోలారీకి ఎనిమిది నుంచి పది బస్తాలు తగ్గించారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై డిప్యూటీ తహసీల్దార్ తారాబాయ్ మాట్లాడుతూ విషయం జిల్లా అధికారులకు తెలియచేసి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని చెప్పారు.

మృతదేహం లభ్యం



శివ్వంపేట(నర్సాపూర్): చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైంది. బోజ్యా పంచాయతీ హరిదాస్ తండాకు చెందిన బానోత్ శంకర్(38) గురువారం సాయత్రం స్నేహితులతో కలిసి గంగాయిపల్లి గ్రామ శివారులో ఉన్న ఊర్గల చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చెరువులోకి దిగిన శంకర్ ప్రమాదవశాత్తు నీట మునిగాడు. శనివారం కుటుంబ సభ్యులు, తండా వాసులు చెరువులో గాలించినా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున చెరువులో మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య అరుణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు.

మట్టి టిప్పర్ సీజ్

పాపన్నపేట(మెదక్): ఎటువంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్‌చేశామని ఎస్ఐ నరేశ్ తెలిపారు. మండల పరిధిలోని పొడ్చన్‌పల్లివైపు నుంచి ఏడుపాయల కమాన్ వైపు అనుమతులు లేకుండా మట్టిని నింపుకొని వెళ్తున్న టిప్పర్‌ను శనివారం సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఆయన చెప్పారు. తదుపరి చర్యల కోసం తహసీల్దార్, అధికారులకు సిఫారసు చేసినట్లు తెలిపారు.

26న ప్రవేశ పరీక్ష

రామాయంపేట(మెదక్): ఆవాస విద్యాలయంలో ప్రవేశానికి ఈ నెల 26న పరీక్ష నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ప్రభుత్వ లేదా ప్రైవేట్ పాఠశాలల్లో చదవడానికి ఆసక్తి ఉంటే తామే సంస్థ తరఫున డబ్బులు చెల్లిస్తామని వారు పేర్కొన్నారు. స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ శిక్షణ ఇస్తామని, విద్యార్థులు తమ దరఖాస్తులను రామాయంపేటలోని స్వామి వివేకానంద విద్యాలయంలో అందజేయాలని సూచించారు.

చర్యలు తీసుకోవాలి

వెల్దుర్తి(తూప్రాన్): విధులు నిర్వహిస్తున్న తనపై గ్రామానికి చెందిన కావేటి శేఖర్ దాడికి ప్రయత్నించాడని ఆరెగూడెం పంచాయతీ కార్యదర్శి రాజేశం పోలీసులకు ఫర్యాదు చేశాడు. డ్రైనేజీ నిర్మాణం విషయంలో అసభ్యంగా మాట్లాడుతూ కర్రతో దాడికి ప్రయత్నించాడని, అతడిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ నవతగౌడ్ తెలిపారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

కొల్చారం(నర్సాపూర్): జాతరలో ఉల్లాసంగా గడిపిన వ్యక్తి, ఉన్నట్టుండి గుండెపోటుతో మృతి చెందిన ఘటన మండలంలోని రంగంపేటలో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మంగలి గుండయ్య(54) సెలూన్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామంలో రంగనాయక స్వామి జాతర సందర్భంగా బండ్ల ఊరేగింపులో పాల్గొని ఆయాసం రావడంతో కుప్పకూలిపోయాడు. చికిత్స కోసం మెదక్ తరలించగా అక్కడ మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. అతడికి భార్య పోచమ్మ, కూతురు ఉన్నారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

- ఏఓ స్వప్న



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఓ స్వప్న

కౌడిపల్లి(నర్సాపూర్): సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉంచామని ఏఓ స్వప్న తెలిపారు. శనివారం స్థానిక ఆగ్రోస్ రైతు సేవాకేంద్రంవద్ద రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలానికి 60క్వింటాళ్ల విత్తనాలు వచ్చాయని, 30కిలోల బస్తా రూ.2,790 ఉండగా 60శాతం సబ్సిడీపై రూ.1,116కే ఇస్తున్నట్లు తెలిపారు. అవసరం ఉన్న రైతులు పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్‌కార్డుతో ఆగ్రోస్ రైతు సేవాకేంద్రంలో సంప్రదించాలని చెప్పారు.

భూమికి సారం.. పచ్చిరొట్ట పెంపకం

కొల్చారం(నర్సాపూర్): తక్కువ ఖర్చుతో భూమికి ఎక్కువ పోషకాలు అందించి, తద్వారా పంట అధిక దిగుబడికి సహకరించే పచ్చిరొట్ట పెంపకాన్ని చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి శ్వేతాకుమారి రైతులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఆగ్రో రైతుసేవ కేంద్రం ద్వారా సబ్సిడీపై జీలుగ విత్తనాలను రైతులకు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం 60శాతం సబ్సిడీపై రైతులకు జీలుగ విత్తనాలను అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో ఏఈఓ వినత, దశరథం రైతులు పాల్గొన్నారు.

ఎరువుల వాడకం తగ్గించవచ్చు

చిన్నశంకరంపేట(మెదక్): రైతులకు అవసరమైన జీలుగ విత్తనాలు ఆగ్రోస్ కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారి లక్ష్మీప్రవీణ్ తెలిపారు. అవసరమైన రైతులు తమ పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్, ఆధార్ జిరాక్స్‌తో వ్యవసాయ కార్యాలయం లేదా రైతువేదికలో ఏఈఓలను సంప్రదించాలని సూచించారు. రైతులు తమ దుక్కులను దున్ని జీలుగవేస్తే రసాయన ఎరువుల వాడకం తగ్గించవచ్చని తెలిపారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు



పెద్దశంకరంపేటలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో వాసవీమాత జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శనివారం మండల అర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా సంఘం సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో..

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీమాతకు మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించి, ఒడిబియ్యం సమర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

చేగుంటలో..

చేగుంట(తూప్రాన్): స్థానిక కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో వైశ్య సంఘం నాయకులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఘనంగా వీరబ్రహ్మేంద్రుడి ఆరాధనోత్సవం

నర్సాపూర్: పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పెద్దచింతకుంటలోని ఆలయంలో భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో బ్రహ్మేంద్ర స్వామి 331వ ఆరాధన మహోత్సవాన్ని ఆలయ పూజారి వడ్ల రామచంద్రచారి శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కృపాచారి, నరేందర్‌చారి, దశరథ్‌చారి, ప్రవీణ్‌చారి, సతీశ్‌చారి తదితరులు పాల్గొన్నారు.

◆ మృతుల కుటుంబాలకు పరామర్శ

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంతోపాటు కల్వకుంట గ్రామంలోని మృతుల కుటుంబాలను జెడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్ పరామర్శించారు. మండల కేంద్రంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న గెరగంటి ఎల్లం కుటుంబాన్ని, అలాగే ఇటీవల కల్వకుంట గ్రామంలో తండ్రి మృతి చెందడంతో వల్లపు స్వామి కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. ఆయన వెంట సిద్దిరాంరెడ్డి, జీపీ స్వామి, పంజా బాబు, కరుణాకర్, రాజు, కుమార్ తదితరులు ఉన్నారు.

రామాయంపేట(మెదక్)లో..

మండలంలోని వెంకటాపూర్ (ఆర్)గ్రామంలో అంబేడ్కర్ విగ్రహ ధ్వంసం ఘటనలో జైలుశిక్ష అనుభవిస్తున్న నలుగురి కుటుంబాలను బీజేపీ నాయకులు పరామర్శించారు. ఇది సున్నితమైన సమస్య అని, గ్రామంలోనే పరిష్కరించుకోవాలని పంజా విజయకుమార్ సూచించారు. ఆయన వెంట దయానందరెడ్డి, రాజేంద్రప్రసాద్, శంకర్‌గౌడ్, నవీన్‌గౌడ్, తదితరులున్నారు.

◆ 11,600 ఆర్థిక సహాయం

చిలప్‌చెడ్(నర్సాపూర్): అజ్జమర్రి గ్రామానికి చెందిన బాలయ్య ఇటీవల మృతి చెందడంతో గ్రామ అంబేడ్కర్ యూత్ సభ్యులు ఆ కుటుంబ సభ్యులకు రూ.11,600 ఆర్థిక సహాయం అందజేశారు. సత్యం, బాల్‌రాజ్, మొగులయ్య, యాదయ్య, గంగరాములు, దశరథ తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రారంభమైన రంగనాయకస్వామి ఉత్సవాలు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేటలో కొలువైన రంగనాయకస్వామి 688వ పంచాహ్నిక ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వారం రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో మొదటి రోజు శనివారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి జలాలతో అభిషేకం చేశారు. సాయంత్రం గ్రామస్తులు ఎడ్ల బండ్ల ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. సోమవారం స్వామివారి కల్యాణ వేడుకలు జరగనున్నాయని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు.

కూరగాయల వ్యాపారుల ధర్నా

- రామాయంపేటలో మార్కెట్ నిర్మాణం పూర్తిచేయాలని డిమాండ్



ధర్నా చేస్తున్న వ్యాపారులు

రామాయంపేట(మెదక్): కూరగాయలు అమ్ముకోడానికి వీలుగా మార్కెట్ నిర్మాణం పూర్తిచేయించాలని డిమాండ్ చేస్తూ పలువురు వ్యాపారులు ధర్నా నిర్వహించారు. శనివారం వారు మాట్లాడుతూ పట్టణంలో మార్కెట్ సదుపాయం లేకపోవడంతో చర్చిస్థలంలో వ్యాపారం నిర్వహించుకుంటున్నామని, అయితే వారు ఆ స్థలాన్ని ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాత మార్కెట్ స్థలం వ్యాపారానికి అనువుగా లేదని, కొత్త మార్కెట్ నిర్మాణం పనులు అసంపూర్తిగా వదిలేశారని ఆరోపించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడంలేదని వాపోయారు. చర్చికి సంబంధించిన వ్యక్తులు వచ్చి తరచు తమ దుకాణాలు తొలగిస్తున్నారని, ఈ మేరకు ఉదయం దుకాణాలు మూసివేసి నిరసన వ్యక్తం చేశామని చెప్పారు. న్యాయం చేయాలని కోరారు.

అన్‌లోడింగ్‌ను వేగవంతం చేయాలి

- ప్రత్యేక అధికారి బ్రహ్మాజీ



చేగుంట(తూప్రాన్): రైస్‌మిల్లుల్లో నిల్వను పరిశీలిస్తున్న అధికారులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు రైస్‌మిల్లులను ఐసీడీఎస్ పీడీ మండల స్పెషల్ ఆఫీసర్ బ్రహ్మాజీ పరిశీలించారు. శనివారం మండలంలోని పలు రైస్ మిల్లులలో ధాన్యం నిలువ స్థాయిని పరిశీలించారు. రైస్ మిల్లుల నిలువ స్థాయికి తగిన ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించి తరలించేందుకు ఈ పరిశీలన నిర్వహిస్తున్నట్టు బ్రహ్మాజీ తెలిపారు. గ్రామాల నుంచి వచ్చిన ధాన్యం లారీలను వెంట వెంటనే అన్‌లోడ్ చేయించుకోవాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గియాసున్నీసా బేగం, ఆర్ఐ నర్సింగ్ యాదవ్, సర్వేయర్ రవీందర్‌రెడ్డి, ఆయా గ్రామాల రైస్‌మిల్లుల నిర్వాహకులు ఉన్నారు.

కొల్చారం(నర్సాపూర్)లో..

కొనుగోలు కేంద్రాలద్వారా రైస్ మిల్లులకు వచ్చిన లారీలను వెలువెంటనే అన్‌లోడింగ్ చేయాలని నర్సాపూర్ ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి రైస్‌మిల్ సిబ్బందిని ఆదేశించారు. మండల కేంద్రంలో సత్యసాయి పారా బాయిల్డ్ రైస్ మిల్లును ఆయన తనిఖీ చేశారు. ధాన్యం అన్లోడింగ్‌లో తలెత్తుతున్న విషయంపై ఆరా తీశారు. రైతులకు ఇబ్బంది కలగకుండా ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలని అక్కడి తహసీల్దార్ గఫూర్ మియాకు సూచించారు.

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన దొంతి వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయ పూజారి గోపాలశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం హోమం, బలిహరం, ధ్వజారోహణం, ఊరేగింపు, స్వామివారి తిరు కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో ఆలయ నిర్మాణ దాతలు, నిర్వాహకులు పాల్గొన్నారు. ఆదివారం శ్రీదేవి, భూదేవి, సమేత వేణుగోపాలస్వామి పల్లకీసేవ నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వహకులు తెలిపారు.

హోరాహోరీగా కుస్తీ పోటీలు



రేగోడ్: కుస్తీ పడుతున్న మల్లయోధులు

రేగోడ్(మెదక్): పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 74వ వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం రథోత్సవం సాయంత్రం పోలీస్ కృష్ణ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన మల్ల యోధులు కుస్తీలో తలపడ్డారు. హోరాహోరీగా జరిగిన ఈ పోటీలకు సినీ నటి జ్యోతి ముఖ్య అతిథిగా విచ్చేశారు. అనంతరం విజేతలకు ఆమె బహుమతులు అందజేశారు.

అందుబాటులోకి సీసీ రోడ్డు

- మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్

తూప్రాన్: మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులో ప్రజల సౌకర్యార్థం నిర్మించిన సీసీ రోడ్డును మున్సిపల్ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శనివారం మాట్లాడుతూ సీసీరోడ్డు నిర్మాణానికి బడ్జెట్ సరిపోకపోవడంతో తాను ఇన్‌చార్జి చైర్మన్‌గా ఉన్నప్పుడు జనరల్ ఫండ్ నుంచి రూ.3లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. మిగిలిన18 మీటర్ల సీసీ రోడ్డును వారం రోజుల క్రితం పూర్తిచేశామని, క్యూరింగ్ పూర్తి కావడంతో ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషిచేస్తూ ప్రభుత్వం నుంచి అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అల్లపురం సిద్దిరాములు, వార్డు ఇన్‌చార్జి ఆఫీసర్ కుమార్, మున్సిపల్ జవాన్లు ఇర్ఫాన్, వినోద్, సఫాయి సిబ్బంది పాల్గొన్నారు.